# అంతేనా ?

## పాలపర్తి జ్యోతిష్మతి

ఇంట్లో పని పూర్తి చేసుకుని వచ్చి వరండాలో కూర్చున్నాను.

మేముండేది ఒక కాలనీ కావడంతో మైకులహోరు, వాహనాల రణగొణ ధ్వనులు లేవు. పిల్లలు స్కూళ్ళకూ, ఉద్యోగస్థులు ఆఫీసులకూ వెళ్ళే సమయం దాటిపోవడంతో ఆ హడావుడీ లేదు. డిసెంబరు నెల కావడంతో పదకొండు గంటలైనా వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంది. ఇటువంటి ప్రశాంత వాతావరణంలో ఏదో ఒక పుస్తకం చదువుకుంటూ వరండాలో కూర్చోవడం నాకెంతో ఇష్టం.

పుస్తకంలో లీనమైపోయిన నేను గేటు చప్పుడవడంతో తల ఎత్తి చూసి "రా సునందా ! కూర్చో – పనైపోయిందా?" అన్నాను ఆహ్వానమూ, పలకరింపు కలిపి.

"పనిదేముందిలే అక్కా ! ఎట్లాగో అవుతుంది. యాంత్రికంగా చేసుకుపోవడమే గదా !"

"అదేంటి సునందా ? అంత నిరాసక్తంగా మాట్లాడుతున్నావు? ఏమైంది?"

"మనసేం బాగోలేదక్కా." తన్నుకు వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అంది సునంద.

అసలేం జరిగింది? వివరంగా చెప్పు. నువ్వూ మీ ఆయనా గొడవ పడ్డారా? లేకపోతే అత్తగారితో ఏదైనా సమస్యా?" అడిగాను.

"ఆవిడకి నేను ఏ పనిచేసినా నచ్చదు. నేనేం మాట్లాడినా తప్పే. ఎప్పుడూ మా పుట్టింటి వాళ్ళని ఎగతాళిగా మాట్లాడుతుంటారు" ఉక్రోషంగా చెప్పింది సునంద.

"చూడు సునందా ! ఆవిడ వయసెంత? ఆవిడ పుట్టిపెరిగిన వాతావరణం ఏమిటి? మనలా చదువుకుని, పదిమందిమధ్య, రకరకాల మనస్తత్వాల మధ్య తిరిగిన మనిషి కాదు. ఆవిడ ప్రపంచం చాలా చిన్నది. ఇన్నాళ్ళూ ఆవిడ జీవితంలో ఎటువంటి వాతావరణంలో మసిలారో ఆ వాతావరణమే ఇప్పుడు కూడా ఉంటుంది, ఉండాలి అనుకుంటారు. తన తల్లికీ – ఆవిడ అత్తగారికీ, తన అత్తగారికీ – ఆవిడ అత్తగారికీ, తనకూ – తన అత్తగారికీ మధ్య సంబంధాలు ఎలా ఉండేవో, వాటి ప్రభావం ఆవిడ మీద చాలా ఉంటుంది. ఆ పద్ధతినే తనూ కొనసాగించాలనుకోవడం తప్ప ఇవాళ్టి పరిస్థితులూ, సంబంధాల గురించి ఆలోచించే శక్తి ఆవిడకు ఉండదు."

"నువ్వు చెప్పిందంతా నిజమే. అందుకే నేనెప్పుడూ ఆవిడతో గొడవ పెట్టుకోలేదు. ఎదురు చెప్పలేదు. కానీ మనసుకు బాధ కలగకుండా ఉండదు కదా ? అట్లాంటప్పుడు ఎవరితోనైనా చెప్పుకోవాలనిపించదా? ఆ ఇంట్లో నేను నా బాధ ఆయనతో కాక ఇంకెవరితో చెప్పుకుంటాను? ఆయన ఏమన్నారో చూడు. ఇప్పుడు అత్తగారి మాటలకంటే ఆయన మాటలే నన్ను ఎక్కువగా బాధపెడుతున్నాయి". ఏడుపుతో సునంద గొంతు పూడుకు పోయింది.

"అరె ! ఏమయింది సునందా? ఏమన్నారాయనా?" దగ్గరికి జరిగి తన చేతిని నా చేతిలోకి తీసుకుంటూ అనునయంగా అడిగాను.

"నిన్న రాత్రి... నేనేమీ అత్తయ్యగారిని తక్కువచేసి మాట్లాడలేదు, నిందించలేదు. ఆవిడ మాటలవల్ల నాకు బాధ కలుగుతోందన్న విషయాన్ని ఆయన దగ్గర ప్రస్తావించాను, అంతే. ఎంత కోపం వచ్చిందీ? 'మా అమ్మ చాలా మంచిది. పిచ్చిపిచ్చిగా మాట్లాడకు' అంటూ నా మీద మండిపడ్డారు. నేనేం పిచ్చి మాటలు అన్నాను? ఆవిడను కొట్టమన్నానా? ఇంట్లోంచి వెళ్లగొట్టమన్నానా? అన్నీ ఆయనే అనుకుని నా మనసు విప్పి చెప్పడమే నేను చేసిన తప్పా?' అమ్మవల్ల నీకు బాధ కలిగినా నేను నిన్ను బాధపెట్టను' అన్న చిన్న ఓదార్పును, 'నీకు నేనున్నాను' అన్న చిన్న ధైర్యాన్ని నాకివ్వడానికి ఆయనకి మనసు రాలేదు. ఇందుకేనా అయిన వాళ్ళందరినీ వదిలిపెట్టి ఆయన చెయ్యి పట్టుకుని ఈ ఇంటికి వచ్చింది? ఆయన మాటలు పదే పదే గుర్తొస్తూ ముల్లులా గుచ్చుతుంటే జీవితాంతం కలిసి ఉన్నా మనస్ఫూర్తిగా సంతోషంగా ఉండగలనా? అయినా తప్పదు. పడి ఉండాలి." వెక్కిళ్ళు పెడుతోంది సునంద.

'మేడిపండు చూడ మేలిమై ఉండును' అన్నట్లు పైకి 'చూడ ముచ్చటైన జంట' అనిపించే ఎంతమందిలో ఇటువంటి విషాదం దాగుందో?

"మా ఆయన తన తప్పేంటో తెలుసుకునేలా నువ్వు చెయ్యగలవు" చిన్నగా నా చెయ్యి నొక్కి వదిలి వెళ్ళిపోయింది సునంద.

మా కాలనీలో సునందా, సావిత్రమ్మగారూ నాకు ప్రత్యేకమైన వ్యక్తులు. నన్నెంతగానో అభిమానిస్తారు. నేను అడపాదడపా రాసే కథలూ, కవితలూ చదివి మెచ్చుకుంటారు, లోపాలుంటే ఎత్తి చూపిస్తారు. ఏ పత్రికకు పంపాలో సలహా ఇస్తుంటారు. తమకు కొత్తగా, వింతగా తోచిన విషయాలు నాకు చెప్పి 'దీని గురించి ఏమైనా రాయకూడదూ!' అంటూ నా రచనా వ్యాసంగాన్ని ప్రోత్సహిస్తుంటారు.

ఆలోచనల్లో పడి సావిత్రమ్మగారు వచ్చి కూర్చోవడాన్ని నేను గమనించనే లేదు.

"ఏంటమ్మా! ఆలోచిస్తున్నావు?" అన్న పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చాను.

"ఏమీ లేదు పిన్నిగారూ ! ఇప్పుడే సునంద వచ్చి వెళ్ళింది. ఇంతలో మీరు వచ్చారు. పూజ, భోజనం అయ్యాయా?"

"ఆc! ఏం పూజ, ఏం భోజనంలేమ్మా ! ఒక మడి లేదు, శుచి లేదు. పొద్దున్నే స్నానం కూడా చెయ్యకుండా వంట మొదలుపెడుతుంది. ఏదో ! పెద్దదాన్ని. కాస్త దేవుడికి నైవేద్యం పెట్టి భోజనం చేద్దామంటే పాచిముఖంతో పొయ్యెక్కించిన వంట దేవుడికి ఎట్లా పెట్టడం?" సరాసరి కోడలిమీద

ఆరోపణలతో ప్రారంభించారు సావిత్రమ్మగారు.

"ఉద్యోగాలకు వెళ్ళవలసిన వాళ్ళు కదా పిన్నిగారూ! అందులో క్యారియర్ తీసుకుని వెళ్ళాలి. అటువంటప్పుడు వంట పొద్దున్నే మొదలు పెట్టక పోతే టైం సరిపోదు కదా! మీరే కాస్త సర్దుకుపోవాలి. ఏ పాలో, పండో నైవేద్యం పెట్టుకోండి".

"ఈ మాటే మా కోడలు కూడా అంది. వాళ్ళ తొందర నాకూ తెలుసు. కానీ ఎన్నో ఏళ్ళుగా అన్నం నైవేద్యం పెట్టి తినడం అలవాటయింది. ఇవాళ ఒక్కసారిగా మార్చుకోవాలంటే మనసొప్ప ట్లేదు. దానికీ మార్గాంతరం నేనే ఆలోచించాను. వంటంతా ఎట్లా చేసినా, అన్నం మాత్రం నేను స్నానం చేసి వండితే ఎవరికీ ఇబ్బంది లేకుండా జరిగిపోతుంది అనుకున్నాను. అయితే ఆ ముక్క నేరుగా కోడలితో చెప్పకుండా 'ఇదీ నా ఆలోచన. అమ్మాయితో నువ్వుచెప్పు' అని మా వాడితో అన్నాను. అదే నేను చేసిన పెద్ద పొరపాటు. "ఒక్క క్షణం ఆగి దీర్ఘంగా నిట్టూర్చి మళ్ళీ చెప్పడం మొదలు పెట్టారు సావిత్రమ్మగారు. "నేనేం మాట్లాడినా వాడికి విసుగ్గానే ఉంటుంది. 'ఇంత వయసొచ్చింది. ఇంకా నీకీ తాపత్రయాలెందుకు? ఏదో ఇంత ఉడకేసి పెడు తుంటే తిని, కృష్ణారామా అనుకుంటూ ఒక పక్కన కూర్చోక?' అంటూ నా మీద ఇంతెత్తున లేచాడు. వయసు మీదపడుతున్నంత మాత్రాన అన్నం వండి పెట్టడానికి కూడా పనికిరానా? వాడిచేత ఇట్లా అనిపించుకుని బాధపడడం కంటే 'తండ్రీ! నీకు నేనేమీ పెట్టలేను' అని దేవుడికి ఒక దణ్ణం పెట్టుకుంటే మనసుకు ప్రశాంతంగా ఉంటుంది" కొంగుతో కళ్ళు వత్తుకుంటూ ముగించారు.

"నా కొడుకు తన తప్పేమిటో తెలుసుకునేలా నువ్వు చెయ్యగలవు." నా చేతిని తన చేతిలోకి తీసు కుని ప్రేమగా నిమిరి వెళ్ళిపోయారు.

చేతిలోని పుస్తకం మీద మనసు నిలవడం లేదు. నిశ్శబ్ద వాతావరణం భయంకరంగా తోస్తోంది.

ఒక స్త్రీవాద రచయిత్రిగా 'ఆడదానికి ఆడదే శత్రువు' అన్న విషయాన్ని నేను అంగీకరించలేను. ఆ మాట సునందతోనూ, సావిత్రమ్మగారితోనూ చాలాసార్లు అన్నాను కూడా. నా మాటల ప్రభావమో, మరే కారణమో గానీ ఇద్దరి ఇళ్ళలోనూ అత్తాకోడళ్ళ మధ్య ముఖాముఖి పోట్లాట జరిగే పరిస్థితి ఎప్పుడూ రాలేదు. వాళ్ళు నా దగ్గరికి వచ్చినప్పుడు అత్తాకోడళ్ళ మనస్పర్ధలే మొదటగా ప్రస్తావనకు వచ్చినా, చివరకు, వాళ్ళ మధ్య వారధిగా ఉండవలసిన మగాణ్ణి మధ్యవర్తిగా ఎంచుకుని అతనిచేతే మాటలు పడవలసి వచ్చిందన్న బాధే ఎక్కువగా ధ్వనించింది.

స్త్రీ తల్లిగా, భార్యగా, కూతురుగా, కోడలుగా, ఇంకా ఎన్నో రకాల బంధాల్లో ఇమిడిపోతూ, సర్దుకు పోతూ సమర్థంగా సంసారనౌకను నెట్టుకువస్తుంటే మగాడు రెండు అనుబంధాల మధ్య సమన్వయం కుదుర్చుకోలేకపోతున్నాడు. ఒకటి కావాలనుకుంటే రెండవదాన్ని వదులుకోవలసిందే అనుకుంటున్నాడు. ఒకరిని నెత్తికెక్కించుకుని రెండవవారిని చిన్నచూపు చూడడమే గానీ ఇద్దరినీ సమానంగా ప్రేమించలేక పోతున్నాడు.

మగవాడి ఇటువంటి ప్రవర్తనే అత్తాకోడళ్ళ మధ్య గొడవలకి ఆజ్యమవుతుందేమో!

# వేదనావర్తం

చీకటి ఖండమై కునారిల్లుతున్న గుండె
తెల్లని వెన్నెల కలలు గుచ్చుకొని
గుడ్డివైన కళ్ళు
లిపిలేని భాషలో రోదిస్తున్న కన్నీళ్ళు
రగిలే జ్వాలలై దహిస్తూ
చుట్టూ కమ్ముకున్న విద్వేషం
కత్తులు గుచ్చుకోవడమే తప్ప
కాంక్ష లెరుగని హృదయంలో
రెక్కలు విప్పుకోని అనుభూతులు
ఎక్కడో దిగులుగా డ్రమ్ములు
ఎక్కడో జాలిగా ట్రంపెట్లు
నిర్విరామంగా 'గాంగ్'లు.....
లోహధ్వనులు విషాదంగా ప్రవహిస్తూ
మౌనంగా గుండెలో యింకుతున్న సవ్వడి,
నిర్వచనం కాలేని ప్రేమ,
ఇచ్చిన 'వచనం' తప్పి
విలయాత్మక నర్తన
లయ తప్పిన గుండెలో
జ్ఞాపకాల పరావర్తన
కళ్ళెం తెంపుకొని
అనంతంగా పరుగుల గుర్రం
కాలానికి కన్నీటి వంతెన
అంతరాంతరాలలో
ఏక్ తార జ్వర తీవ్రత
వేదనావర్తంలో దూకి
ఆత్మహత్యించుకుంటున్న సంవేదనలు
కెరలుతున్న ప్రణానుబంధం
భుజం మార్చుకోలేని మనసు.

(లాస్‌ఏంజిల్స్‌లో గడ్డకట్టిన ఒక దుఃఖరాత్రిని
అక్షరాల్లోకి కరిగిస్తూ.....)

– డా॥ దిలావర్



దళిత వ్యాకరణం కవితా సంపుటికి శాంతి రజనీకాంత్ స్మారక కవితా పురస్కారం తితిదే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ కె.వి. రమణాచారిగారి నుండి అందుకుంటున్న శ్రీ తుల్లిమల్లి విల్సన్ సుధాకర్. చిత్రంలో మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య సరోజనమ్మ, శాంతి నారాయణ దంపతులు ఉన్నారు.